'స్వచ్ఛ సర్వేక్షణ్'పై అవగాహన కల్పించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 21 : స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై నగరవాసులు ఫీడ్ బ్యాక్ అందించేలా అవగాహన కల్పించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెప్మా సీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ కేటగిరిలో ఎక్కువ మార్కులు వచ్చేలా ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీకి చివరి గడువు మార్చి 31తో ముగుస్తున్న తరుణంతో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యతో వినియోగించుకునేలా ఆర్‌పీలు ఫోన్‌ల ద్వారా సమాచారం అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్‌రావు, టీఎంసీ రమేశ్, సీవోలు సఫియా, శ్రీలత, సకినాల రమేశ్, స్వాతి, అలీ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు 'హైపర్'

హనుమకొండ, మార్చి 21 : భారీ వర్షాలు, ఈదురు గాలులు సంభవించినప్పుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరణకు 'హైపర్' అనే ప్రణాళిక రూపొందించామని హనుమకొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మధుసూదన్‌రావు తెలిపారు. ప్రతి ఒక్క ఉద్యోగి హెడ్ క్వార్టర్‌లో ఉండి అవసరమైన మెటీరియల్, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ హైపర్ కార్యాచరణ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి దోహదపడుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 21 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ, న్యూ శాయంపేట సబ్ స్టేషన్ల పరిధిలోని రాజాజీనగర్, రంగుబార్ వెనుకసైడ్, పద్మాక్షి రోడ్, జేఎస్ఎం స్కూల్ రోడ్డు ఏరియాల్లో సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

టెక్నాలజీలో విద్యార్థులు రాణించేలా తర్ఫీదునివ్వాలి

- **కలెక్టర్ ప్రావీణ**
- **పున్నేల్‌లో 10వ తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ**
- **మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సందర్శన**

ఐనవోలు : పున్నేల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఐనవోలు, మార్చి 21 : శాస్త్ర, సాంకేతిక అంశాల్లో విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మండలంలోని కక్కిరాలపల్లి జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసి స్ట్రెంథనింగ్ ఎఫ్ఎల్ఎన్ త్రూ ఏఐ టూల్స్(కృత్రిమ మేధస్సు) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ(ఎఫ్ఎల్ఎన్) అంశాలపై విద్యార్థులు కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో అదనపు అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

సాగు, తాగునీటి సమస్య పరిష్కరించండి : కక్కిరాలపల్లి గ్రామస్తులు

కక్కిరాలపల్లి గ్రామంలో సాగు, తాగు నీటి సమస్య ఉందని పరిష్కరించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. వీధి దీపాలు వెలగడం లేదని, కొంత మంది దివ్యాంగులకు కొత్త పింఛన్లు రావడం లేదన్నారు. క్రీడా ప్రాంగణం అన్యాక్రాంతం అవుతున్నదని, పరిరక్షించాలని కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా, తహసీల్దార్ ఫీల్డ్ విజిట్ చేసి బౌండరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ పరిశీలించారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పున్నేల్ జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, ప్రశ్నపత్రాలు తరలింపుపై ఆరా తీశారు. అనంతరం జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి..

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ వార్డును సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్, మెయింటనెన్స్ రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని కొంత మంది వైద్య సిబ్బంది హనుమకొండలో జరిగే సమావేశానికి వెళ్లారా? అని ఆరా తీశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల డబ్బాలను పరిశీలించారు. ఆమె వెంట డీఈవో వాసంతి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఆనందం, ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, పంచాయతీ సెక్రటరీలు అశోక్, నిర్మల్‌కుమార్, కిశోర్, కారోబార్ నిరంజన్ ఉన్నారు.

బాలికల సంరక్షణకు మరిన్ని కార్యక్రమాలు..

హనుమకొండ : బాలికల సంరక్షణకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళా పోలీసులు, ఉద్యోగులతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కమిషనరేట్ వద్ద సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, డీఆర్డీవో మేన శ్రీను, డీఎంహెచ్‌వో అప్పయ్య, డెమో అశోక్‌రెడ్డి, షీ టీమ్, భరోసా ఇన్‌స్పెక్టర్లు సుజాత, సువర్ణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సీడీపీవో విశ్వజ, బాలరక్షా భవన్ కో ఆర్డినేటర్ అవంతి, మెప్మా అధికారి రాజేశ్‌గౌడ్, జిల్లా మిషన్ శక్తి కో ఆర్డినేటర్ కల్యాణి, బాలల పరిరక్షణ అధికారి సౌరం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌టీపీ నిర్మాణ స్థలాల పరిశీలన

ఎస్‌టీపీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్

వరంగల్, మార్చి 21 : అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేయాల్సిన ఎస్‌టీపీ నిర్మాణాల స్థలాలను మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. శుక్రవారం ఆమె ఆరెపల్లిలోని వ్యవసాయ కేంద్రం వారి స్థలం, బొల్లికుంట ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని అధికారులతో కలిసి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌టీపీలు ఏర్పాటుకు గుర్తించిన జోన్లలో స్థలాలను ఎంపిక చేశామని, మిగతా ఎస్‌టిపీల కోసం స్థలాలను త్వరగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మల్లికాంబలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

చిన్నారులతో సీఎండీ వరుణ్‌రెడ్డి, డాక్టర్ సుదీప్

హనుమకొండ, మార్చి 21 : మానసిక దివ్యాంగుల్లో ఒక లక్షణమైన డౌన్ సిండ్రోమ్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. అనంతరం డౌన్ సిండ్రోమ్ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన, ఫ్యాన్సీ డ్రెస్ చూపరులను అలరించింది. పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో అపర్ణ ఆస్పత్రి ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు మాడిశెట్టి సుదీప్, డాక్టర్ అజిత్, కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, బండా సదానందం, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

సంకీర్ణ ప్రభుత్వాల వల్లే ప్రజాస్వామ్యానికి రక్షణ

- **హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్**
- **కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు**

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : దేశంలోని విభిన్న జాతులు, కులాలు, మతాలు, బహుళ సంస్కృతీసంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యానికి రక్షణ కేవలం సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటు ద్వారానే సాధ్యమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జీ హరగోపాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో శుక్రవారం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తెచ్చి సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే రాజకీయ పార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు. చైతన్యవంతులైన ప్రజలు లేకపోతే ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. నేటి రాజకీయ పార్టీలు కార్పొరేట్ శక్తుల ధన ప్రలోభాలకు లోనై ఓటర్లను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదకరమన్నారు. 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతీయ సమాజానికి నష్టకరమన్నారు. నేటితరం విద్యార్థులు సమాజాభివృద్ధి బాధ్యతను, ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను పెంపొందించుకోవాలని హరగోపాల్ సూచించారు. గుల్బర్గా యూనివర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ జి.శ్రీరాములు మాట్లాడుతూ.. ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని, ప్రజల అవసరాల కనుగుణమైన పాలనా అందిస్తేనే ప్రాంతీయ ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామచంద్రం, కేయూ ప్రిన్సిపాల్ మనోహర్, ముంబై యూనివర్సిటీ ప్రొఫెసర్ జోష్‌జార్జ్ పాల్గొన్నారు.

కాజీపేటలో చైన్‌స్నాచింగ్

కాజీపేట, మార్చి 21 : పట్టణంలోని ఓ జనరల్ స్టోర్‌లో మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చైన్ లాక్కెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. నిట్ కళాశాల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న దేవాన్స్ జనరల్ స్టోర్‌ను కొండవీటి రాణి నడుపుతున్నది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి షాపులో సామాన్లు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించారు. రాణి మెడలోని రెండున్నర తులాల బంగారు తాడును లాక్కొని ఆటోలో పరారయ్యారు. కుటుంబ సభ్యులు 100కు కాల్ చేయగా, కాజీపేట పోలీసులు ఘటనా స్థలానికి చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆటో నంబర్ ప్లేట్ కనిపించకుండా కవర్ చేసినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

ఆత్మకూరు, మార్చి 21 : నీరుకుళ్ల క్రాస్ వద్ద కిరాణా షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సామాన్లు చోరి చేసినట్లు యజమాని కంబాల రాజు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి షాపును బంద్ చేసి నీరుకుళ్లలోని ఇంటికి వెళ్లాడు. తెల్లవారి వచ్చే చూసే సరికి షాపు వెనుక భాగంలో రేకును వంచి వాటర్‌బ్యాటిళ్లు, సిగరెట్ ప్యాకెట్లు, స్వీట్ డబ్బాలు, పేపర్ ప్లేట్స్, గ్లాస్‌లు అపహరించుకు పోయారని, వీటి విలువ సుమారు రూ.5వేలు ఉంటుందన్నారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు.

27న ఢిల్లీలో జరిగే బీసీల మహాధర్నాకు తరలిరండి

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : 'హలో బీసీ.. చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఆమోదించాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్‌తో ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జి నాగరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మజాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి, సులోచన, ప్రమోద పాల్గొన్నారు.

తండ్రి స్ఫూర్తితో రెండు ఉద్యోగాలు సాధించిన యువకుడు

పవన్‌కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న ఇంజినీరింగ్ అధికారి

ఆత్మకూరు, మార్చి 21 : నీరుకుళ్ల గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన పోతురాజు పవన్‌కుమార్ ఇటీవల రవీంద్రభారతిలో నిర్వహించిన కొలువుల పండుగ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అంతకుముందు విడుదల చేసిన గ్రూపు-4లోనూ ఉద్యోగం సాధించి ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివానని, తన విజయానికి తండ్రి ఈశ్వరయ్య ఎంతో స్ఫూర్తినిచ్చాడని చెప్పారు. ఒక సంవత్సరంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పవన్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

'ఎర్త్ అవర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

హనుమకొండ చౌరస్తా/శాయంపేట , మార్చి 21 : ఎర్త్ అవర్‌లో భాగంగా ఈ నెల 22న రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకు అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేయాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా అసోసియేట్ డైరెక్టర్ పుల్లూరి వంశీకృష్ణ అన్నారు. హనుమకొండలో నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణం(పబ్లిక్ గార్డెన్) ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొంటారని చెప్పారు. గంట పాటు ప్రజలంతా ఎర్త్ అవర్ కార్యక్రమంలో పాల్గొనాలని శాయంపేట తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ఎర్త్ అవర్ పోస్టర్‌ను డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతితో కలిసి ఆవిష్కరించారు. షేక్ గౌస్, భానుమతి, కల్పన, రవిచందర్ పాల్గొన్నారు.

నేడు చైతన్య విశ్వవిద్యాలయ 13వ స్నాతకోత్సవం

మాట్లాడుతున్న చైతన్య వర్సిటీ చాన్సలర్ పురుషోత్తంరెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయ 13వ స్నాతకోత్సవం రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ హిమాయత్‌నగర్‌లో ఈ నెల 22న యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ సీహెచ్‌వీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 1991లో చైతన్య డిగ్రీ కాలేజీ, 1993లో పీజీ కాలేజీలను స్థాపించినట్లు తెలిపారు. విద్యార్థులకు డిగ్రీ, పీజీ స్థాయిల్లో వివిధ కోర్సులకు కంప్యూటర్ సబ్జెక్టులను పాఠ్యప్రణాళికలో చేర్చామని, చైతన్య విద్యాసంస్థలు వరసగా మూడు పర్యాయాలు న్యాక్-ఏ గ్రేడ్, స్వయం ప్రతిపత్తి గల కాలేజీలుగా విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం, కాకతీయ యూనివర్సిటీ ద్వారా గుర్తింపు పొందిందన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా అస్సాం గౌహతి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ ఉపాధ్యులు సూర్యనారాయణమూర్తి, గౌరవఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎనుగాల పెద్దిరెడ్డి పాల్గొని డిగ్రీలో ర్యాంకులు పొందిన ఆరుగురు, పీజీలో ర్యాంకులు పొందిన 8 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. 677 మంది డిగ్రీ, పీజీ పట్టాలు, ఇందులో పీహెచ్‌డీ విభాగంలో 83 పరిశోధకులు పట్టాలు పొందుతారన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

హసన్‌పర్తి, మార్చి 21 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో కంటి చూపు లోపాలు ఉన్న పిల్లలందరికి డీఎంహెచ్‌వో అప్పయ్య శుక్రవారం కళ్లద్దాలు అందజేశారు. ప్రిన్సిపాల్ సుధాకృష్ణ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి దుర్గాప్రసాద్, వైద్యాధికారి కుమారస్వామి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 11,999 మంది రెగ్యులర్, నలుగురు ప్రైవేట్ విద్యార్థులకు 11,995(రెగ్యులర్), ఇద్దరు (ప్రైవేట్) విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. ఇందులో నలుగురు (రెగ్యులర్), ఇద్దరు (ప్రైవేట్) విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. జిల్లాలో హాజరు శాతం 99.97గా నమోదైందని చెప్పారు.

ఓయూలో ఉద్యమాలపై నిషేధం ఎత్తివేయాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సదస్సులు, సెమినార్లు, ధర్నాలు నిర్వహించడంపై నిషేధం విధిస్తూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ కేయూ ప్రధాన కార్యదర్శి కావ్య డిమాండ్ చేశారు. కేయూ మొదటి గేట్ ఎదుట శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఓయూలో విద్యార్థి ఉద్యమాలపై ఆంక్షలు అప్రజాస్వామికమని, రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. కేయూ ఉపాధ్యక్షులు అనూష, గణేశ్, నాయకులు శ్రీజ, శివాంజీ, ప్రశాంత్, రాజ్‌కుమార్, నరేశ్, సిద్ధు, నాగరాజు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇరువర్గాల ఘర్షణ

ఇరు వర్గాల గొడవలో విరిగిపోయిన కుర్చీ

హనుమకొండ, మార్చి 21 : వడ్డేపల్లి వంద ఫీట్ల రోడ్డులోని రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. శుక్రవారం రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇరు పార్టీలవారికి కమీషన్ల పంపకం విషయంలో మాటా మాట పెరిగి గొడవ ప్రారంభమైనట్లు చూసిన వారు చెప్పారు. ఈ క్రమంలో కార్యాలయం లోపల ఒకరిపై ఒకరు చేయివేసుకోవడం, కుర్చీలతో కొట్టుకోవడంతో కుర్చీలు విరిగిపోయాయి. పలుపురికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. ఇందులో ఒక వర్గం వారు 100కు కాల్ చేయడంతో కాజీపేట పోలీసులు వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించగా వారు ఎవరో తమకు తెలియదని, గొడవ జరుగుతుంటే సిబ్బందిని అప్రమత్తం చేసి ఇరు వర్గాలను బయటకు పంపించినట్లు చెప్పారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ, మేయర్

బియాబానీ దర్గాలో ఇఫ్తార్ విందు

కాజీపేట, మార్చి 21 : దర్గా కాజీపేట పట్టణంలోని సయ్యద్ షా అజ్జల్ బియాబానీ దర్గాలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్గాలో పీఠాధికారి ఖుస్రూషాషాతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్, మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో ఎడిట్ ఆప్షన్

వరంగల్, మార్చి 21 : ఎల్ఆర్ఎస్ ఫీజు మదింపులో దొర్లిన తప్పులను సరిచేసేందుకు ఎడిట్ ఆప్షన్ వచ్చేసింది. ఎట్టకేలకు ఎడిట్ ఆప్షన్ రావడంతో ఫీజు మదింపులో దొర్లిన తప్పులను సరిచేసుకునేందుకు పెద్ద ఎత్తున బల్దియా కార్యాలయానికి వస్తున్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద బారులు తీరారు. ఎడిట్ ఆప్షన్‌లో ఫీజులోని తప్పులను సరిదిద్దే ఆప్షన్ మాత్రమే ఉంది. పేరు మార్పు, ఇతర అంశాలను సరిదిద్దే అవకాశం లేదని జీడబ్ల్యూఎంసీ అధికారులు తెలిపారు.

సమస్యలే పరిశోధనలకు ఆధారం కావాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 21 : నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలే పరిశోధనలకు ఆధారం కావాలని పింగిలి కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. 'సుస్థిర భవిష్యత్తు, ప్రపంచ నాయకత్వ దిశగా సైన్స్ ఆవిష్కరణలకు యువతకు ప్రేరణ కలిగించడం' అనే అంశంపై కాలేజీ రసాయన శాస్త్ర విభాగం, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(టాస్) సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. టాస్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనలో విద్యార్థులు ఎంచుకోవాల్సిన అంశాలపై అవగాహన కలిగించారు. టాస్ జోనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి సైన్స్ ఫర్ సొసైటీ అనే అంశంపై ప్రసంగించారు. జిల్లా కో ఆర్డినేటర్ రామరాజు సుస్థిర అభివృద్ధికి వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం అనే అంశంపై మాట్లాడారు. ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి గ్లోబల్ చాలెంజెస్ సైన్స్, ఆవిష్కరణలలో యువత పాత్రపై ప్రసంగించారు. సెమినార్ కన్వీనర్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యఏసీ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, రసాయనశాస్త్ర అధ్యాపకులు ప్రశాంతి, ఉదయశ్రీ, బాలరాజు పాల్గొన్నారు.

25న సంత బహిరంగ వేలం

పరకాల, మార్చి 21 : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని గొర్రెలు, మేకలు, పశువుల సంత, టైబజార్‌ల సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చెల్పూరి వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26వ సంవత్సరానికి 1 ఏప్రిల్ 2025 నుంచి 31మార్చి 2026 కాలానికి నిర్వహించనున్న వేలంలో ఆసక్తి కలిగిన వారు 24వ తేదీలోగా రూ.2,500 చెల్లించి షెడ్యూలు ఫారం సూచించారు. వేలంలో పాల్గొనే వారు కమిషనర్ పరకాల మున్సిపాలిటీ పేరుపై ఏదేని జాతీయ బ్యాంకులో రూ.2లక్షల విలువైన ధరావత్ సొమ్మును డీడీ రూపంలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు జీపీ షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు శనివారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణంలో గ్రామ సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పార